
ఓం శ్రీసాయిరాం

శ్రీసాయి సుదర్శనగీత

సృష్టి పటలం

ఓం శ్రీ పరమాత్మనే నమః

సాయి శివహరి ఓం



చతుర్ధ అధ్యాయము — జ్ఞాన యోగము

(1) (17-09; పందొమ్మిదవ రోజు)

| | |
|---|---|
| 1. | కలడు కలడో లేడో కన నేడ్తువేల ధనమంత వెచ్చింప కన్పింతునా నేను<br>భక్తితో తలవంగ భగవంతుడై రానా సిద్ధపురుషుడ నే సాయినాథుండ....! |
| 2. | కాదందునా నేను ఆర్తితో పిలవంగ లేనంటినా నేను ఎందులో వెదకినా వెదికినన్ దొరకనా,<br>పిల్చినన్ పలుకనా కనిచూడు, అనిచూడు కన్పింతునో లేనో ....! |
| 3. | నీ అంతరంగాన నిత్యంబు నిలువనా ..కృష్ణపరమాత్ముండ పండరీనాథుండ<br>దత్తదేవుండ విప్రనారాయణుండ.. రాముండనై గాతు ఈశుండనై బ్రోతు....! |
| 4. | అగ్నిలో నేనే ఆకాశమున నేనే.. భవ్యుండ, నవ్యుండ, పాలకుడ, పోషకుడ,<br>కర్మను, కర్తను, హర్తను నేను.. నారాయణుండనై నడిపింతు నేను....! |

| | |
|---|---|
| 5. | కాలంబునై నేను కబళింతు నేను.. ధర్మంబునై నేను నడిపింతు నేను<br>వేదాలలో నేను, వాదాలలో నేను, ఉపనిషత్తులలో నేను....! |
| 6. | ఉగ్రుండనై నేను, ఉర్వి నూపేను రక్షింతు, భక్షింతు, శిక్షింతు నేను<br>నాదు లీలల నరయ ముక్కంటినైన నారాయణుండనై బ్రోతు నన్నరయలేవా....! |
| 7. | నా మనసు నీదైన నీ మనసు నాదే ! అంతర్యామినై, ఆర్తత్రాణ ఆర్తితో పిలువ తండ్రినై గాతు, తల్లినై<br>బ్రోతు సర్వకాలాలలో సర్వేశుడై నిలుతు.. నన్నరయంగ లేవ శాంతి ప్రియుండ సాయినాథుండ....! |
| 8. | నగుము నగుము నగవేల ననుగాంచి..అది, ఇది లేదని ఏడ్చెదవేల... ?<br>నీ బ్రతుకు నడిపింప రథ చోదకుండ..బ్రతుకు కళ్ళెములు నాకిచ్చి త్రుళ్ళింతపడుడీ....! |
| 9. | ఎవరికి ఏది ప్రాప్తమో ఏదెంత ప్రాప్తమో.. అంతంత నీకిత్తు నది నీకు ప్రాప్తి<br>పాపమై పండినా ఖర్మమై నిండినా..నీ వ్రాతు నున్నదే, నా చేత గాదు....! |
| 10. | రోగులను, భోగులను, అన్నార్తులను.. నేను సమాదరుండనై సహోదరుండనై<br>తన్మయపరచి యోగులను సేతు....! |
| 11. | కులము లేదు నాకు, మతము లేదు నాకు, మన్నించమని చేరు, మనకు మర్యాద లేదు<br>దర్శించు భక్తునిగా దత్తాత్రేయుండగా..మన్నింపుమని వేడు మారుతిగా దోతు....! |
| 12. | నర్తింతు నీవు గోర నటరాజునై నిలుతు.. రక్షింపుమని గోర లక్ష్మీనారాయణుండనై<br>నీ భావమేమున్న ఆ రూపాల ధరియింతు.. అన్యుడనుగాను అభయహస్తుడను నేను....! |
| 13. | సిరుల జల్లెడివాని శ్రీశిరిడి వాసుండనై, ముక్కోటి దేవతల మొక్కున్న గాని నీ ముందు నిల్చేటి<br>మీ దైవంబునే గాని సంగీతమున, సాగరమున, కావ్యంబులో, లలితకళా సరస్వతినై పల్కింతునా<br>పరవశింప పాడింతు నే పాట నీ నోట నా పాట ...! |

(2) (18-09; ఇరవైవ రోజు)

| | |
|---|---|
| 14. | సుద్దులు చెప్పితినని చిరచిర లాడక నీ బుద్దిన్ మార్చు సదుద్దేశమే<br>తట్టల్, బుట్టల్, కానుకలు, కాసులు, నేనే నాడు ఆశింప - ప్రేమతో నొక్క తులసీదళము అర్పణచేసిన<br>నిను కాపాడక పోనే, సారె, సారెకు మాటలేల - సద్గురు సాయినాథుని కను....! |
| 15. | నీ పిడికెడు హృదయంబున పిలువ.. నే నిల్తు, ఇసుమంత చోటిచ్చినన్ నీ జీవితమంత<br>ఆ చంద్ర తారార్కమై నిలువ బోధింతును గదే, సుంతయినన్ నా చెంత చేరి చింత బాపుమా....! |
| 16. | తల్లిదండ్రులు నీపై అలిగిన అలుగుదురు గాక .. బందు బాంధవుల్ మిత్రుల్ నిను ఎకసక్కెములు<br>ఆడిన ఆడుదురు గాక ..! భగవంతుడైనన్ నీ బ్రతుకును కని ఈర్ష్య చెందిన చెందుగాక<br>సాయీశు సద్గురువును నమ్మిన నీ బ్రతుకు చక్కదిద్దడే...! |

| | |
|---|---|
| 17. | గురుబ్రహ్మా, గురుదేవో మహేశ్వరః  మంత్ర జపమే నిలుపగ గునగున నడచిన<br>నీ చెవుల చెప్పంగ లేదే  ఒప్పుగ విన్న మరి క్రొత్తగా నే చెప్పనేల....! |
| 18. | భగవంతు డలిగినన్ భయము తీర్ప సద్గురు వుండు, సద్గురువు మాటలు మరి చెవిని పెట్టుకున్న<br>నిను కాపాడ ఏ దేవుడొచ్చునయ్యా...?  ఇసుమంత విను ఇది సాయీశు బోధ ....! |
| 19. | పుట్టిననాడే నీ వెచట నుండి వచ్చితివో తా గట్టిగ పట్టు బట్టినా<br>పట్టునా నీకు ఈ అధోగతి ఔరా...! నిను రక్షింప నెవడు వచ్చు....! |
| 20. | నీ వచ్చిన దేడనుండి, పోవుట ఎచట..ఈ మధ్యన బ్రతుకు ముగియదే మూన్నాళ్ళ ముచ్చటలై<br>చిమ్మెద వేటికి విషాగ్నికీలలు, నెమ్మది నుండలేవో..నరముపై వుండు నడమంత్రపు సిరి<br>నడిపించు నిను అధోగతికి నరుడా .. కను నిప్పుడైన సద్గురువును కనులు తెరచి....! |
| 21. | నీ బ్రతుకు నా కర్పణ చేయుము - నీ బ్రతుకు కర్మలకు నను కర్తను చేయుము భరింతు భరింతు<br>నీ బ్రతుకు తరింప చేయుదు - మరి మాటలు కాదు సాయి చేతలు చూడుమా....! |
| 22. | చెప్పింది చెప్పన్ మరి చేసి చూపించు - నీ చేతను విడువన్ పడుము నా పాదములపై<br>బ్రతుకుకొక అర్ధము మరి నే చెప్పుదు - ఇది సాయీశుని బోధ వినరా ఓ నరుడా...! |
| 23. | బ్రతుకుకొక అర్ధము లేదు మనుగడ సాగించుట కొక అర్ధమున్నదా — కన సౌఖ్యమున్నదా<br>ఏటికి అడుగు అడుగు — నను నమ్మక వైతరణిని మునిగిన ఆ పలుకులు ములుకులై గ్రుచ్చవా....! |
| 24. | భగవంతుడైన భక్తుల సహించునే ! నా జీవిత ప్రాసంబులో ఏకైక వ్యసనమేమిటో<br>భక్తులు ఆర్తిని పిలువ రక్షించుట కాదా అది అలుసు చేయకు, ఆటలాడకు, అర్ధించు దయకై....! |
| 25. | ఆద్యంతమైన నా పదములు నమ్మినవానిని అంభోధిని దాటింతు అవలీలగా<br>దర్శించగలేవు ధరణిని వెలసిన సాయినాథుని ఆకాశమెక్కి చుక్కల చూచుచుంటివే....! |
| 26. | చిక్కెదవు చిక్కెదవు అదుగో కాలుడు నీపై కాలపాశంబులు వేయ - అసువులు బాతువే గాని<br>ఎప్పటికి ఏపాటి వచ్చు నామాట వినక - మృగతృష్ణల నీరు త్రాగెదవే..? నీ దాహము తీరు దారది కాదు<br>హరిపదములు నమ్ము దరిచూపు ధామమదే....! |
| 27. | ఫక్కున నవ్వగలరు పదిమంది చూసిన ! ఏటికి మొండితనము, నోటికి వాడి నీ గుణము<br>కక్షలు కార్పణ్యాలు ఏల పెంచెదవు చేరుము సద్గురువు  పదములు<br>చెడు చెప్పనేర్చునా ఈ సాయినాథుడు పదములను వేడ....! |
| 28. | నీ ధర్మములు నీవు చేయుము  నీ కర్మకు కర్త వగుదు, క్రియవు నగుదు<br>భోక్తవవుదు భాంధవ్యుడు నవుదు నను దరిచేర పాపములు ఏనాడు అంటవు నీకు....! |
| 29. | అర్థంబు నీడవై అలరారుచుండు పరమార్థంబు ఆశించకు ఏ నాడు |

| | |
|---|---|
| | పరమాత్మచేర్పు నీ ఫలములు నీ కీర్తి, నీ ఆర్తి, నీ జీవన స్ఫూర్తి, శృతి, నీ భ్రాంతి, నీ గతి....! |
| 30. | సర్వస్య శరణాగతి చేయి సాయినారాయణుండనై సత్యలోకాలకు చేర్తు<br>సరిదిద్ద నీ బ్రతుకు సరంగునై పరికించు పలికించు సాయి నామామృతము....! |
| 31. | బోధనామృత సుధాబ్ధియందు ఓలలాడు వారలకు - అందింతు నేను ఆత్మ సాక్షాత్కారము<br>ఆనంద మూర్తినై ..బ్రహ్మైక్య మూర్తివై బ్రతుకంత గడుపు సర్వము నీ దారిలో నీ సద్గురువు నోయి |
| 32. | నీ చదువులు ఏటికి తగలేయి ఈనాడు సదసద్వివేకమై వర్ధిల్లలేవే, సద్యో జ్యోతివై నిలువంగ లేవే<br>పంచభూతాలు కలిసి పడిలేవక ముందే మరి తప్పించుకో నీవు, పలుమార్లు చెప్పితిని...! |
| 33. | దేముడైనాగాని, రాముడైనాగాని, శ్రీకృష్ణ పరమాత్మ, పరమేశు రూపుడను, నను గొల్లవాడను చాలు<br>బండనైనా గాని వేల్పునవుదును కాదే నీ ఇచ్ఛ దీర్చుదును, నీ బ్రతుకు నడిపింప నా చేత కాదా....! |
| 34. | నీ కర్మ నీకున్న పుట్టి కుడపంగ కర్మ దీర్తునా, నీ కళ్ళు పొరలు కమ్మగా !<br>పాపాల బ్రతుకులో కోపాల అవధిలో తాపాలు చెందుచును<br>హరియించి హరియించి చివరకు నీ బ్రతుకు చిగురు విస్తరియవు....! |
| 35. | ఇన్ని రూపాలలో నేనుండ, నీ చెంత నే నున్న దర్శించ వేమి<br>ధర్మపన్నాగాలు పలుకుట ఏమి ఏమిరా వినవేమి వినవేమి విశ్వప్రభువు మాట....! |
| 36. | ఏ రూపు నీ మదిని నిల్పినను చాలదా ఏ శక్తులలో నైన సాయిశక్తినై నిలుచు<br>లలితన్న, బాలన్న, బాలాజి అన్న, వీరభద్రుండ, శక్తుండ, ముక్తుండ, దత్తుండ, నవనాథులు నుండ....! |
| 37. | ఎంచగా ఎన్నెన్ని శక్తి పీఠాలుండ, ఏ రూపులోనైన నొక్కింత నిలుపలేవే మదిని<br>పోనీ శ్రీశైల మేగుదువా? మల్లిఖార్జునుడ నగుదున్ గణనాథు డందువా గణపతి నగుదున్<br>సింహాద్రి అప్పన్న యాదగిరి నరసన్న ఏ పేరున నిలిచెనేమో నీ మదిని ! |
| 38. | ఎన్నెన్ని రూపాలు ! ఎన్నెన్ని శక్తులో ! ఎన్నెన్ని మార్గాలో ఏమిరా నా కన్న ! చెప్పను అంతకన్నా<br>జ్ఞానమార్గములో సాయినాథుడు గాను  పిలిచేటి నిలిచేటి నిత్య దేవుడుగాను మరియుంచు నీ మదిని..! |
| 39. | ఇది సాయిగీత — మరి తీర్చదే వ్రాత నీవెట్టి భక్తుడవు — నేను నీ భక్తికే భక్తుండ....! |

(3) (19-09; ఇరవై ఒకటవ రోజు)

| | |
|---|---|
| 40. | జ్ఞానమును లేక జీవించుట ఎందుకు అజ్ఞానపు అంధకారములో బ్రతుకు ఎన్నడో వెళ్ళబారున్<br>కుళ్ళిన పండుగా పండు ముసలివైనా నీ జీవితము సాఫల్య మగుటెన్నడో.... ? |
| 41. | జ్ఞానదీపికను వెలిగించ మన్నది చిమ్మచీకటిని చీల్చుటకు కదా - భోగమును విడనాడి<br>త్యాగమును నేర్చుమన్నా భోగి కాలేనివాడు - త్యాగి కాలేడనుచు, భోగములు భోగించుచు..<br>భాగ్యమును ప్రేమించుచు.. ఇంద్రియలోలుడవై భువిని ఎన్నాళ్ళు బ్రతికినన్ మోక్షమున్నదే....! |

| | |
|---|---|
| 42. | చీకటిని గుడ్లగూబవై - స్వార్థము పెంచుకొని చీకట్ల చరియింతు వేని నిన్నెవరు తీయలేరు పైకి<br>ధరణిని ధర్మాచరణము ముఖ్యము కదా....! |
| 43. | కర్మల చేయుము కర్తవు కాక సర్వకర్మలను నిలుపుము సర్వేశ్వరునిపై<br>నిమిత్తమాత్రముగ చేతువేని  నిన్నంటంగబోవు కర్మలు, కర్తను నేను కాదా....! |
| 44. | నీ పొట్టకు నీ బట్టకు  చెడి బ్రతికి సంపాదించి చచ్చుటలో ఘనత యున్నదా... ?<br>గడియ, గడియకు చెప్పించుకొనకు  పరుల ప్రాణంబుల తీసెడి బ్రతుకు బ్రతుకేపాటి? నీ బ్రతుకెందుకో ! |
| 45. | బండలు బారిన నీ బ్రతుకుపై బండపడ - ఆ బండలనైన చెప్పి కరిగించ నేర్తు,<br>కొండల నైనా పిండి కొట్టంగ నేర్తు - చెప్పిన నీతులు చెప్పి చెప్పి నోరు నొచ్చెనే, క్షణక్షణమునకు చచ్చెడి<br>నీ బ్రతుకు బ్రతుకుచెడి చెడుబ్రతుకు బ్రతికి భూమికి భారము కాదే |
| 46. | పరులకై ధన, మాన, ప్రాణము లిచ్చువాడు - నిత్య సత్యమై నిలుచు ఆ చంద్రార్కమై కీర్తి చంద్రికలు<br>పరులకై ప్రాణములిచ్చు - త్యాగధనులు నెడెన్నడో.. ఆనాడే పోయిన పోక నిలిచిన వారి<br>మంచిపోకడలు చిరంజీవులై ఆ నోట, ఏ పూట వర్ధిల్లుచుంటిరే..  పశువుగాతమేయ,<br>పక్షిగూడుమేయ, గొర్రె దాటుపోక  మనిషివైనావునీవు మంచినిగాంచ మనసున్నది సుమతివై బ్రతుకు! |
| 47. | నీ పాపంబు పరిహరింప, నీ తాపంబులు దీర్చ  నీ రోగములు మాన్ప, మీకై నా తనువున్<br>ధరణిని పంచితిని గాదే? అన్నా ఆ దినము నీవు మరచినన్, నీవొక మనిషి వగుదువా....! |
| 48. | దేముడు దేముడన్న పది చేతులు నాలుగు తలలు శంఖ చక్రంబులన్న తలపు మీ తలపున తరలించుము |
| 49. | మనిషినై నీ మనిషినై నీ మనసు మరల్ప మమతల తెరలు తెరవ కలతల బాపి కరుణాంత రంగుడనై<br>సాయినాథుండనై శిరిడిలో మెల్గితిని నేను కాదే...! |
| 50. | నేనొక ఫకీరంచు అరచిన పరులలో మీరున్నారులే, నను గుర్తించి, గుర్తుంచిన, ఏ పదిమంది<br>ప్రియ శిష్యులు నా నెచ్చెలులై మెచ్చెడివారు కాదే....! |
| 51. | ఈ నాడైనన్, ఆనాడైనన్, ఏనాడైనన్ చెప్పిన నీతులు రీతులు ఆచరించినన్<br>చరిత్ర చలనము కాదా ! ధరణి ఇలా నిలిచి ఉండునా....! |
| 52. | నిను తరింప చేయగ మీ భ్రమలు విడనాడి బ్రతుకుదురంచు బ్రమించు భ్రమరములై<br>మీ బ్రతుకున చుట్టుముట్టి మీ పాపములు మట్టు పెట్టి అన్న సాయన్ననై నిన్నటిదాక నీ మనిషినై<br>నిలచిన, నే నేనాడైన అన్నానా, నే హోగవంతు డనుచు... ? |
| 53. | రాడు.. దివినుండి ఆ పాండురంగ డనుచు దిక్కులు చూచితినే కాని, మీకై మీ దిక్కుగా వచ్చిన<br>మీ కళ్లెదుట నున్నన్ కనిపెట్ట గలిగితిరా నన్ను, ఈ సాయినాథుని<br>కావరము నిండిన కనులతోన కమలా కాంతున్ కనగలరా....! |

| | |
|---|---|
| 54. | మిము మార్చుట ధరణిని కూల్చుట కంటె కష్టమా ! ధరిత్రిని ప్రేమను నింపి<br>మిము చరింప చేయు జనకుడ నేను కాదే ! కూరిమి తనయా....! |
| 55. | ఓరిమి చెప్పెద నొకపరి, మరి యొకపరి చేరిమి చేసేది, నా చేతులంచున్, నా నెచ్చెలులంచున్,<br>నీ మేలిమి కోరి చెప్పితి మీతో కటిక నేలల పండితి, నుండితి ఎండు రొట్టెల పైన....! |
| 56. | కలసితి మెలసితి పులచిన పలికితి మీ ఇచ్ఛలు తీర్చితి - కక్షలు బాపితి కారుణ్యమున<br>సాయిమాతనై నిలిచితి కల్పవృక్షము పగిది నా నీడ నీ జీవికకు నిచ్చితి ..నీకై బ్రతికితి నీకై నిలచితి<br>మీ పాపంబులు కరగించితి, హరియించితి భిక్షము తెచ్చి, సర్వ జీవులకు కృపాబిక్ష నిచ్చితి<br>నీ బ్రతుమును మార్చ తనువును పుడమిని పంచితి కాదే....! |
| 57. | అనాటి దశమి తిరిగి, తిరిగి మరి దశాబ్దములు మారినన్, శతాబ్దముల్ వచ్చినన్, నా నీతులు,<br>సుధాపయోక్తులు, నా జీవిత మగునా మీకు మార్గదర్శక మేనాడైనన్....! |
| 58. | ఈ నా దేడ్చెదవేల..? నా దేముడు సాయిరాము డేడంచు కనుల ముందర కనిపించెడి<br>కలశాంబుధి కాలదన్ని బురద గుంటలకై పడిపోయెడి మీ బుద్బుద ప్రాయమగు బ్రతుకులకై<br>ఏడ్వరే ఏనాడన్న, అన్నన్న, మీకై బ్రతికిన నే నాడే ప్రాయోపవేశంబు చేయుట మేలు కాదే....! |
| 59. | ఎన్నెన్ని జన్మలెత్తిన నీ కనుల ముందర కన్పించినన్ నీ కర్మము తీరలేని కారణమేమో, నా ధర్మము<br>తప్పక చెప్పితి వినకుంటివి జీవించుము కాకివై కలకాలము, పోరా..పో..కాల కర్మండవై....! |
| 60. | చిలకకు చెప్పిన మాటలు ముద్దు ముద్దుగా పలక నేర్చు మురిపెము మీర చెవిటికి మాట వినిపింప నేర్తు<br>మూగలు భాషణల్ భాషింప నేర్తురు చేరి మూర్ఖుడవు నిను రంజింప నే నేర్వను....! |
| 61. | నే చెప్పిన వాక్యముల్ మరియొక పరి పరిపరి నీ మానస పయోంబుధిలో పడి మునుగక మునుపే<br>ఆలించుము దాటించెద భవవారధి నిను....! |
| 62. | సమాధియందున్నన్ నీ సముండనై మీ మధ్యన మీ మనసు నిండియుండ మాధవుండనై<br>సాయినారాయణా శరణన్న నేటికీ నే కాంతు దీనజనారణ్యముల రోదనలు చేయకుడి....! |
| 63. | మిము నే కాంతు నే మన్నన కలిసినా ఏమి....! |
| 64. | నీ మనమునందు నిలచిన, నవనీతచోరుండ - నీ ప్రేలాపన దీనారావముల్ మన్నించుదు ఒకటిగ<br>పరుగిడి వత్తునే ప్రేమ మీర ఆర్తితో నీవు పిలువ హృదయాంతర్వర్తియై వెలుగు పాండురంగడే<br>సాయినాథుడు....! |
| 65. | పిలుపు, పిలుపున స్పందించి, సమాధిని వ్రయ్యలు చేసి, మీ సముఖమున నిలచి,<br>సాయిశక్తినై కాపాడుతున్న కరుణామూర్తిని కాంచలేని మీ బ్రతుకు లేపాటివో....! |
| 66. | ఆడంబర వాగాడంబరములు నేడు హెచ్చి అంబరములు తాకెనే గాని కాంచను..<br>నేను హృదయ పరివర్తనను ఏనాటికి మమ్మేనాటికిన్ కాంచగలేని ఓ తనయ |

| | |
|---|---|
| | నా కన్నీరు కురియ నీ కన్నీటిని నే తుడువ నేర్తునే....! |
| 67. | నే నావిర్భవించిన కారణము - కనుగొని ఆచరించితివే విశ్వము మారి సాయిపుత్రులై<br>పలికింప మానస తంత్రులు - పలికింప సాయిగీత నా మానసము పులకింతలు కాదే....! |
| 68. | అర్ధముకావా..నా ఆనతులు, వినతి సేయనా మరియొక పరి విశ్వంబులో నీవొక నలుసువై,<br>పదుగురి కంట నీరు పడచేయక, పన్నీరై సాయి సుధారస పానము చేయుము.....! |
| 69. | చిలుకుము సాయి సూక్తులను సాయినామ ప్రేమామృత ధారలు పంచుము జగమంతన్<br>జగజ్జ్యోతులై విజ్ఞాన దీపికలై నారాయణమూర్తులై నరసేవ చేయుడి విశ్వమే ప్రేమమూర్తిగా....! |
| 70. | జగమే జగన్నాథ రథమై వెలయ దగద్ధగిత దీపికలై జ్వలించుచు - దివ్య ప్రబోధామృతములు<br>ప్రబోధించుచు జగమంతయు ఒక్క త్రాటిపై నడిపించెడి జగన్నాథ రథచక్రములైననాడు<br>ప్రియైక స్వరూపులై నిలిచెడి నీ వీనులకు విందొసర్చనే ఆ మోహన మురళీ గానఝురిలో సుస్నాతులై<br>పునీతులై వెలయంగ నా జన్మము సార్థకమగు నాటికి కదా.... ? |
| 71. | దశదిశలన్ దెసదెసలన్ సాయి కథామృతములు ఝురులై పొంగి పొంగి ఉప్పొంగి<br>మానవ మానసంబులు మాధవుని చేర అన్నన్న ! ఆనాడే దశమి విజయ దశమి కాదే....! |
| 72. | దశములు ఎన్ని వెల్లినన్ దశాంకమైన మార్పులేని మీ దశ నా దిశన్ ఎన్నడు మారునో ఆనాడే<br>దశ సహస్రాంశ ప్రణామము లాచరింతునే....! |
| 73. | లక్షల కధిపతి యైన రమాపతినే ! నే బిక్షమెత్తిన కారణం..వివరించెద విను లక్ష్యము ఉంచి,<br>కోటీశ్వరుడైన తనవెంట పోనాడు..చేత చిల్లిగవ్వ పట్టుక పోనేర్చునే, పట్టున్ బ్రతికిన వెంటనే<br>ఇత్తును పిడికెడు బిక్షమంచు ఇచ్చితి కృపాబిక్ష నెనరున్నదా....! |
| 74. | సర్వము కల్గిన సర్వ లక్షణ శోభిత సాక్ష్యాద్విష్ణు మూర్తినే కటిక నేలల పవళించితి<br>కారణమేటి సెప్పవో? సఖ్యత ముఖ్యము మీలో, బ్రతుకున భోగముల సేయవా అలక్ష్యం<br>చెప్పటకే చేర్చితి ఆ బండన్ మీ అండన్....! |
| 75. | నేను యతినై ఉండి మతిలేక మీ సంసార సమస్యల సునాయాసంబుగానె చిక్కితినని<br>చిటిపోటి మాటలగ కపటము లేక చెప్పెద విశ్వసంసారినే మీకై మీ సమస్యల చిక్కితినే కాని<br>చిక్కంగ లేదు మాయా వ్యామోహమునన్....! |
| 76. | నాకై నా బ్రతుకు నే బ్రతికిన నే నీ సాయిరాముండెట్లు అగుదురా ! మతిచెడి మాట్లాడెదవు<br>భోగివి గాక క్షణమైనను జీవితము త్యాగము చేసిన లక్ష్యము మీకు బ్రతుకు ధర్మంబయిన<br>మరి ఇంకొకరికి మంచిని పంచ బ్రతుక నెంచు ఇల నీవు భగవత్ స్వరూపుడవు గావే....! |
| 77. | మీ పాపము పొంచి కబళించు వేళలన్ నా తనువు నీ కిచ్చి, నీకై ధరాతలమున<br>తలవంచి మిము రక్షించితి, ఈ ఇలాతలము రచియించినది నేను కాదే.. ? |

| | |
|---|---|
| 78. | బ్రహ్మాండము, అఖిలాండము, అండము, పిండము, సర్వసృష్టికి పుష్టి యంచు,<br>నే రక్షించుకొన నేర్వక కాదు మీకై త్యాగగుణము బోధించుటకై జగన్నాటక సూత్రధారినై<br>రచించిన నాటకమిది, తెలుసుకో, సాయినాథుని మాట ఇది....! |
| 79. | నా లక్ష్యము ఇప్పటికైన అలక్ష్యము చేయక రక్షింతువేమి లక్షణమైన బ్రతుకు నీది<br>తక్షణమే మీకు కల్పింతును రక్షణ తప్పక నిత్తున్, మాట తప్పను....! |
| 80. | లక్ష భక్షణములు చేయు నాకిది ఓ చిన్ని లక్ష్యమే తక్షణము నా లక్ష్యము<br>లక్షింపక చరింతువేని శిక్షింతు ! రక్షింతు నంటి నా రక్షణ నేల కొరవు...! |
| 81. | ఆశల మారి నరుడా నక్కకు జిత్తులు నేర్పిన పొత్తుగాడా, ఈ చిన్ని ఆశయైన నెరవేర్తువని<br>చెప్పితి అలక్ష్య మేమిటి? అడుగుము ఇత్తు కృపాబిక్ష రా రమ్మని....! |

(4) (20-09; ఇరవై రెండవ రోజు)

| | |
|---|---|
| 82. | నీకై మెచ్చి దిగి వచ్చితి దివినుండి భువనమాతనై మమతను పంచితి సమవర్తినై<br>సర్వులు నాకు సమము కాదే, తరతమ భేదములు లేని నాకు<br>తమ తమ గుణములు ఆరోపించి అన్యుని చేయుట న్యాయమే? |
| 83. | మూర్తీభవించితి త్రిగుణముల త్రిమూర్తుల ఏకరూపిగా ..మూర్ఖపు ఆలోచనల ముగ్గుర వేరుచేసి<br>పోరు చేసెదవేటి.. పోకిరి బుద్దులు మాకు నెత్తిన రుద్ది ఏడ్వంగా, నీ ఏడుపు నీకు చాలదే<br>వేరుపరిచి మము ద్వేషాగ్ని రగిలింప చూసితిరే అన్నన్నా ! |
| 84. | మానవతలు మరిచి మతాగ్ని ద్వేషులై మీ కుత్తుకలు మీరే కోసుక పచ్చి నెత్తురు త్రావంగ నేర్చిన మీ<br>గుణములకు ఓర్చినందునే తరతమ భేదములెంచి మంటలు పెట్టగ చూచితివే మామధ్యన అన్నన్నా ! |
| 85. | గుండెలు తీసిన బంటులు నరులై నిలిచిరి అఖిలాండ కోటి బ్రహ్మాండములో, జీవ ప్రపంచములో....! |
| 86. | కైలాసంబుపై శివరూపంబున కైవల్య పదమిచ్చితి నే నొకటిగానే<br>వైకుంఠపురమున శ్రీనారాయణుడై భక్తులను మెప్పించితి నే నొకటిగా<br>సృష్టికర్తనై విధివిలాసముల మీ నొసటిన కర్మ ధర్మంబుల రాసితి నొకటి గానే....! |
| 87. | త్రివిధుల, త్రిగుణముల, త్రిమూర్తులనై సృష్టి  బహుపుష్టి చేయ.. బహు రూపినైన నను<br>సమైక్యతగా కాంచగ లేవు, కాంచుము బ్రహ్మనై వెలసిన దేవరో, నేనే — నేను త్రిమూర్తిని |
| 88. | ఈ పగిదిని మీ గుణములు మీ కంటినది చాలదా నను దహించినన్ సహించితి సాయిమాతనై<br>మీ అవగుణములకు అంతము లేక  మీ గుణములు నా కాపాడింప అంటురోగమై<br>త్రిమూర్తులు వేరనుచు కుడుచి కూర్చుని ఆ పిచ్చి కూతలు పనికిమాలిన చేతలు చేయు<br>నిన్ను చూచి కాంచి, కంట నీరిడక, కావలింతునా....! |

| | |
|---|---|
| 89. | బ్రహ్మాండమును సృష్టిని నిలప నే త్రిమూర్తులనై  సృష్టి, స్థితి, లయ కారకుండనై,<br>సృష్టిని పుష్టిని గూర్చ సర్వసృష్టి చేసితి సర్వోత్తములై సరగున కనుగొను,<br>సరగున చేరుము సరసిజ సంభవుని పద సరోజము....! |
| 90. | సృష్టించునది నేనే — సృష్టికర్తయును నేనే  రక్షించితి నేనే — దుష్టుల శిక్షించుదు నేనే<br>పరమేశుడనై పాలించునది నేనే  ప్రళయ నాట్యమాడు మృత్యుంజయుడను నేనే |
| 91. | సృష్టంతా నేనే, విశ్వ పుష్టంతా నేనే.. నన్నేల, మున్నేల, నా లీల అరయంగ లేవేల? మూడు మూర్తులా<br>నేనే, ఏకీభవించిన ఏకమూర్తిని నేనే, ఏకాకి విడదీసి ద్వేషములు మాలో రగిలింప ఏడ్తువేల....! |
| 92. | నిరక్షర కుక్షి నీ గుణావగుణముల సహియింపనొల్ల మిమ్ము అక్కుపక్షింజేతు గొంతు నొక్కినన్<br>నీ గుడిసేటి గుణము, ఆ గుసగుస ఇంకేటికో ఏటికి ఎదురీదెదవేల ఓయీ, ఓ నరుడా !<br>భగవంతుని పదములంటి  భవజలధి దాటి తరియించుమంటి....! |
| 93. | వైష్ణవుడంచు వైదీకమంచు తరతమ భేదము లేటికి ఏటికి చీటికీ మాటికీ ఈ పోటాపోటీ ఏమిటి |
| 94. | ఏటికి పొగరుబోతువై అరచేత అంటిన స్వర్గంబు కూలద్రోసు కొనుట?<br>ద్వైతము, అద్వైతము అయినను బ్రహ్మత్వము నందక తప్పదు మాకేటికి....! |
| 95. | శ్రీకారంబును నేనే, శిలువలో నేనే, ఓంకారంబున నేనే, ఘీంకారంబున నేనే<br>ఐంకారంబున నేనే, హ్రీంకారంబున నేనే, ఏ ఆకారము లేని నిరాకారుడను నేనే,<br>సాకార రూపుడై సరికొత్తగా దోచు రూప రూపములు నేనే, బహురూపిని నేనే....! |
| 96. | పరమేశుడ నేనే, వైకుంఠవాసుడ నేనే, విధిని శాసించు విధాతను నేనే, సంధాన కర్తను,<br>సత్య  సంకల్పుడను,  బహురూపుడను   ఒక్కొక్క  తావులో  ఒక్కొక్క  రూపెత్తి..  బహురూప,<br>బహుగుణముల, నవగణముల విభిన్నశక్తుల, భిన్న రూపములెత్తి పాలింతు..నా పాలనా దక్షతకు.. పరి,<br>పరి రూపముల, బహునామ గుణములందు పలు, పలు రకముల అవతారంబుల,<br>బహు అవధూతలను  అన్నిట బహురూపుల, బహు గుణంబుల నొప్పారు బ్రహ్మత్వము....! |
| 97. | ఏక రూపుండనై భాసించితి నేనే పలురూపంబుల పరిభ్రమించినది నేనే....! |
| 98. | ఒకచోట పుట్టుచు, మరొక చోట చచ్చేటి మీ నొసటి వ్రాతలు,<br>గీతలు, గీయుచు, విధాతనై, సంధానకర్తనై, త్రిగుణంబుల,<br>త్రిమూర్తుల, త్రివిధముల,  నానావిధ అవతారంబుల, నదికి ఉపనదులై,<br>కాలువల, గుంటల, కంతల నాలో నీవు ఐక్యము కాగా పరవశించుచు<br>వరవడి క్రొత్త వరవడులను సుడులు గిర్రు, గిర్రున తిరగ ఉరకల,<br>పరుగుల నురగలు కక్కుచు..నవతరంగములై నానాగతుల ననుగలసి సముద్రమున లయించు కాదే....! |
| 99. | పదేపదే పది అవతారంబులే గాక, నేకాని రూపు నేలేని తావును ఎక్కడ ఉన్నదే చూపు ఏతావున |

| | |
|---|---|
| | ఏరీతిని, ఏ పిలుపున, శివున్, మాధవున్, బ్రహ్మన్, రాముస్, కృష్ణున్, రంగన్ నానా అవతారంబు లెత్త<br>ఆ రీతిని మీరంతా ఏ రీతిన భజించినస్ మీ అజ్ఞానత నను విభజించినా నే నేకరూపుడనై<br>సాక్షాత్ శ్రీమన్నారాయణుండనై....! |
| 100. | ఆ పాలకడలిని తేలియాడిన, ననుజేర.. నానావిధ తరంగముల - సముద్రము ఉప్పొంగు రీతిలో<br>భావ భక్తిన్, నవవిధ భక్తులన్, నానా సంకీర్తనలన్, భజనల, మంత్ర తంత్రాంగంబుల,<br>సముద్రమున నొప్పు, నొక్కొక్క తరంగంబై, ఏ పగిది సముద్రమునన్ చేరినన్, నా దరికి చేర్తు<br>నవమార్గములన్, నే ఏకరూపుండ శ్రీమహావిష్ణుండ....! |
| 101. | మీ ఇష్టమున మీ కష్టంబు దీర్ప, నారాయణ రూపుండనై బహు గుణంబుల,<br>బహు గణముల, త్రిమూర్తుల, దేవతల, ఇలవేల్పుల, పితృ దేవతల, మాతృకల నర్తించి<br>మిము సంద్రమునన్ జార్చి, నా సన్నిధి తరింప జేయు మార్గగామిగా....! |
| 102. | ఏక రూపిన్, నాదగు నంశన్ మీలో నిల్పినందునే మీ అజ్ఞానపు తెరల అంధకారముల్ గ్రమ్మగ<br>మీ నొసటి వ్రాత మార్చలేక నా కడుపు కోతగాక, మిము నా సన్నిధికి ఏ రీతిన చేర్చుకొనంగ<br>నవతరంగిణినై అవతరించిన సాయినాథుని మాటలు ఆలించినను చాలు... సద్గతుల నిత్తు<br>చూడన్ నీవొక శివ భక్తుండవో, వైష్ణుండవో..ఎవరివైనా నీవు ఏ భక్తిని చేరిన, ఏ రీతిన పిలిచిన<br>భక్తికి ప్రాముఖ్యమునిచ్చి ఏ తరంగమై వచ్చినా ఈ పద సందోహముల చేర్పించదా, చేరి తరించుడి<br>అన్నన్నా ! నే అన్నానా ఎపుడైనా నీవు వైష్ణవుడవు, శివ భక్తుండనుచు, బ్రహ్మతత్త్వంబవనుచు....! |
| 103. | ఏ దారిలో, ఏ రీతిని కడలిని నానా తరంగములు ఉధృతములై ధృతిమీరగ నాపి.. ఒకే రీతిగా,<br>ఒకే రూపువై.. నా సన్నిధానములు తరింప జేయుదు మీరెవ్వరైనను, ఏ మతమైనను,<br>నా సన్నిధానమున ఏకరూపినై పరిపూర్ణులవుదురు కొట్టుక చచ్చెదరేల త్రిమూర్తులను నేను కాదే<br>నొక్కి చెప్పినన్ మీదారి మీదైన, గోదారే మీకు తరించగన్....! |
| 104. | వేచియుండుదు నేను మీకొరకు ఆ పాల కడలిని కల్పాంతరంబుల ముక్తుల సేయగా<br>మిము కన్న నేరానికి నాకు కడుపుకోత తప్పదు.. ఏనాటికైన ముక్తుడవౌదు వంచు<br>నీ తలవ్రాతన్ మాన్పింప మహాంబుధిని శ్రీమహావిష్ణువునై....! |
| 105. | ఏకంబై ఒప్పారు మహాంబోదుల అంభోధినై నిర్వికల్పుండనై, నిరామయుడనై, నిరాకారుడనై,<br>నానా విధ రూపంబులు, నాలో అంతరింపగా సంచరింతు బ్రహ్మాండము భాసింపగా....! |
| 106. | మీ భ్రమల్ వదలి ఏ రూపు, ఏ కులమత ద్వైత, అద్వైత, వైష్ణవ, వైదీకమనుచు చూడక ఏకంబుచేతు<br>బ్రహ్మాంభోధిని, కొట్టుక చచ్చుచు.. ఏల కుత్తుకల్ కోసుకొనంగ....<br>కులమతము లడ్డు వచ్చునా? బ్రహ్మను చేరంగ నవ మార్గములుండ<br>కుల, మతములని కొట్టుక చావ కల్పాంతరములు తిరినా... నీ ఏడుపుకు అంతంబున్నదా? |

| | |
|---|---|
| 107. | సంధాన కర్తను, సరసి జనాభుడను,  నీకు పుట్టుక నిచ్చిన బ్రహ్మను<br>నాకే నీతులు నేర్ప విసగితిని కొట్టుక చావుడీ కోతులై, బావిలో కప్పలై....! |
| 108. | నే నెన్ని ఉగ్గుల రంగరించి పోసినన్ నీ గొంతు దిగని విష కషాయంబాయెనే<br>శ్రీరంగని చేరగ లేవు ఎన్నెన్ని జన్మలెత్తిన సాయినాథుని మాట వినకయున్న ....! |
| 109. | నానా విధ మార్గములు నా దరిని చేరు మహాంభోధి దీపికలై దీపించు<br>మీ జీవిత సహాయకులకున్ ఏ దారిన వచ్చిన నాదరి చేర్పింతు చేరెదవు ముమ్మాటికి....! |
| 110. | సద్యోగుణవంతులైన ఈ సముద్రము చేరి తరించుడి శ్రీ హరిని లయించుడీ మరు జన్మలు ఎత్తకనే..! |

(5) (21-09; ఇరవై మూడవ రోజు)

| | |
|---|---|
| 111. | యజ్ఞము లేల చేసెదవు, కలిని ఆకలిని దీర్చి బ్రతుకుటే ఒక యాగమౌ !<br>యజ్ఞం బననేమో, యాగం బననేమో ... యోగుల్, భోగుల్ తెలియగ<br>పదముల్ చెప్పెద అలింతువేని, ననుచేరు తేలిక మార్గముల్....! |
| 112. | యజ్ఞంబున యజ్ఞకుండముల్, యతివేషముల్, యాగకుండమున్<br>వెలిగించ వేలవేల ఖర్చుల్ సరుకుల్ అవునా అది యజ్ఞము, ఆడంబరము గాని....! |
| 113. | నీ అజ్ఞానము ఎండగట్టి విజ్ఞానపు ధునుల వేల్చన్ వివేకోదయమై....<br>గోవిందు పొందున్ కందురు ఆలమందలై ....! |
| 114. | అజ్ఞాన అంధకారము మీ మనమున క్రమ్మగ ఏ యజ్ఞము చేసినా తరింతురే ! అది యాగంబేనా !<br>ఆగమే గాని ! సుయోగము నంద సుగుణ భాసివై<br>గోవిందుని గోముగ పిల్చినన్ గోపాలుడై నిన్ను గానక పోడే ....! |
| 115. | మీ అజ్ఞానము ధునియందు వేయుడి కట్టల్ కట్టి మీరు కట్టికుడిపిన పాపమెల్ల<br>కాల్చుదు మసిగ, నుసిగ, కసిగ నసత్తు నుండి సత్తు అవతరించె ....! |
| 116. | విజ్ఞాన విభూతిని చెసి ఇత్తు విజ్ఞానపు వెల్గులు వీధుల్ నిండ<br>విభూతి పూతలో మీ నొసటి వ్రాతల్ మాన్ప ధరించుడీ, భోగ లాలసతను నుసింజేతు....! |
| 117. | వాంఛలన్ పంచుక ఎన్నేళ్లు బ్రతికినన్ వాంఛిత మేమున్నది పాప సంచితము పెంచుటే కాని,<br>భగవంతుని చేర మీ బ్రతుకుల సాఫల్యము గల్గున్<br>భవమును దాటి నా పదముల విందు కలుగ భాగ్యమే గాదా....! |
| 118. | తీరని కోర్కెల తీర్చుకొనుటకై, క్షుద్ర దేవతోపాసనల్ చేసిన క్షుద్రుడవై బ్రతుకు క్షీణించున్<br>అక్షయమౌ భవ రామనామ తారక మంత్రము నాల్కన<br>నాలుగు గడియలు ఆడించిన ముక్తి నిత్తు, ముముక్షవైన చాలదే....! |

| | |
|---|---|
| 119. | క్షణభంగురమైన సంసారంబునన్ రోతంబడి ఈత రాక ఏ పగిది నెంత ఈదినన్<br>జల బుద్బుదంబులైన జీవితాలకున్ అంటిన కర్మ నశించగన్ పంచభూత సంయోగ మందున జనించు<br>ఈ తనువు, తటాలున ఏ క్షణము పంచభూతముల కలియకున్నదే....! |
| 120. | మాయలపడి పంచ భూతాకారమైన దేహమునన్ భార్యా భర్తలు, సోదరులంచు తలంతురు<br>సత్వ రజస్తమో గుణంబులు ఏయే గుణంబుల పుట్టిన<br>ఆయా గుణంబులన్ జేరి ప్రవర్తింతురు నరులు నాల్గు విధముల....! |
| 121. | సత్వ గుణమున నీ పుణ్యఫలములు కల్గిన నేమి...? దేవ గుణంబుల యజ్ఞ యాగముల సత్వమతివై,<br>ధరన్ సంచరించి సద్గతుల ఆచరించి మోక్ష ప్రాప్తి నందంగలవే? |
| 122. | రజోగుణమున మానవుడవై మహిని భోగ లాలసతలు గని<br>మోహ బ్రాంతుడవుచు భగవంతుని చేరగ లేక మదిని క్రమ్మిన మాయవు తెరల్ వీడగ లేక...<br>కుడితిన్ పడ్డ ఎలుకవై, ఇహమున్ పరమున్ చెందక విలవిల లాడెద వేల? |
| 123. | మునుగుచున్నన్ మీ మతుల తుది పల్కయినన్<br>ఆ ముక్కంటిని చూడ నిముషముల్ తలచి చేరెదవా ఆ ఇందిరా రమణున్....! |
| 124. | సరిదిద్దగవచ్చు మానవతను, మీ మదిని మాధవుని నందగ వచ్చున్ మీ సుకృత ముండెనేని<br>గోవిందు పదార వందముల నందన్ జన్మల్ చరితార్థ మందగలరే అవని యందు....! |
| 125. | రజస్తమో గుణముల్ నూటికి ముప్పాతిక తమోగుణముల్ రాక్షస గుణముల్ జన్మింతురు,<br>సహజ జన్ములై, పదిమందిని కొట్టగ పొట్టల్ కొట్టగ నీ సృష్టికి దృష్టిన్<br>నాశన మొనరించ నర్తింతురు నరాధములలో, ఆ నరకాసుర రాక్షసాధముల్ నయమే కాదే....! |
| 126. | అసురులందు అజ్ఞానమున్ ప్రకటించుకొన్న ఆ నిజతత్వము గని సంతసించితిన్<br>లోకులన్ ముంచు పని చేసిననేమి నిజమున్ ఒప్పుకొనుటే మేలుగాదా? |
| 127. | మేలు, మేలంచు సంతసించితి సత్యాన్వేషి నే కాదొకో?<br>నాదు చేతులు దునుమాడి నా ధుని యందు పాపములు దహించితి....! |
| 128. | ఇచ్చితి మోక్ష ప్రాప్తముల్ సద్గతుల్ అందగ, అసురులలో<br>ఆ యొక్క సద్గుణంబే నచ్చే నాకు ఎందెందు నాకు నచ్చిన అందందే మోక్షమిత్తు....! |
| 129. | మానవు లటంచు మాయ తెరల మేలి ముసుగుల్ తగిలించికొన్న మీ మానవత<br>తెరల మరుగున మరుగజేసి నరరూప రాక్షసులై నర్తించినన్ మీసహజ ప్రవృత్తుల్<br>రాక్షస వృత్తుల్ మీ మనసున కప్పెట్టిన నే కాననే ....! |
| 130. | విశ్వమానవ సౌభ్రాతృతల్ నాదగు నేత్రములు నీ చేష్టలు కాంచగలేనే ! లోకుల కుత్తుకలు గోయు, |

| | |
|---|---|
| | మీ గుణముల్ కని లోతుగ గుంతలు త్రవ్వి నిప్పెట్టినన్..పొగలైనా రాక నీ ప్రొద్దులు గుంకు వరకు<br>లాగకుడీ, రాక్షసాధముల నశింప జేయగ అవతారములు ఎత్తుట కొత్తగాదు గద....! |
| 131. | అవలోకించు చుంటివా ! మీ పాప చేష్టల నా కయిష్టమైనన్ మీ పాపము ఫలంబై పండువలె<br>ఆ కాలంబునకై కాంచుచుంటి అప్పటి వరకే మీ నర్తనల్, ప్రవర్తనల్, అకృత్యముల్ భరింపగ నేర్చెద<br>మీ రాక్షస ప్రవృత్తుల నిర్మూలించగ కల్కినై నొప్పించె, నా కాళ్ళకింద నల్గి చత్తురే....! |
| 132. | నా నిజగుణమున మీ నీచ రాక్షస గుణములన్ ఓర్చి నప్పటి దనుక క్షమించ నేర్చితిన్....! |
| 133. | నేరరు రాబోవు కర్మలన్, మున్ముందు వచ్చు పాపపు జన్మలన్, నే కాచుచు వుంటి, గత జన్మల నుంచి<br>చెప్పినన్, నీకే నా స్వగతం అర్ధము గాదని ఎంచి, ఎన్నెన్నో రీతుల మిము మార్చ తలచితిని....! |
| 134. | మీ మానవతన్ మేల్కొన జేసిన ప్రయత్నముల్ లెక్కకు రావు ఈ లెక్కన<br>మీ లెక్కకు రాని బ్రతుకుల నా లెక్కకు జేర్చుకొనగ సఖ్యతన్ సాటితి సాయినాథుండనై ....! |
| 135. | సఖ్యత కలిగెనేని ఆ ముఖ్యాంశములు గ్రహించ, మదినైన<br>నీ బ్రతుకులకిత్తు సహృదయుడనై శుభోదయంబు, నే క్షమా మూర్తినే....! |
| 136. | కనుకన్ కనువిప్పు, గను, నేటి కైనన్ నాటి రాక్షసులకు మేటివంచు నీ ఒప్పుకొంటి వేని<br>ఆ నిజ గుణమైన నిను, నా నిజధామమున నీ సొత్తు జేర్చు ఓ నరుడా ! నీ పొరలన్ బేధించి<br>నీ అసుర ప్రవృత్తుల్ అణగారన్ సాయినారాయణున్ శరణుం గోర<br>పదకైవల్యము నిత్తు పలుకుమా, ఒక్క సత్యమైన నీ జీవితంబునన్....! |
| 137. | పూజల్ చేసి తరించువారు కొందరు పూజ్యులై.. పూజల్ చేసి కామితార్ధముల్ కోరెదరు<br>మరికొందరు, కామితార్థులై పూజల్ చేయక కామితముల్ కోరక కర్మముల్ ఫలాపేక్ష రహితంబునన్<br>నిర్లిప్తులై ధర్మము నాచరించుచున్ చరితార్థులు అవుదురు మరికొందరు స్థితమతులై, మరి కొందరున్<br>కామితములకై చేసెదరు పూజలు క్షుద్రదేవతల, కాలంబు వ్యర్థముగా....! |
| 138. | కలలై కన్నుం దెరచునంతలో కరగిపోయెడి కల్లలైన జీవితమును గాంచలేక<br>శాశ్వతమంచు అశాశ్వతమైన బ్రతుకులన్ క్షుద్రపూజలన్ వ్యర్థము సేతురు....! |
| 139. | ఇహమున్, పరమున్ అందగలేక, కాలమునన్ కలియుదురే కాని శిలలై పదికాలముల్ నిల్తురే !<br>పావన గంగన్ సలలిత పవిత్ర స్నానముల్ చేయగ ఆ పరమాత్ముని చేరి తరించ నేర్తురే....! |
| 140. | మురికి గుంటల, కాల్వల మునిగి మీ క్షుద్ర కోరికల్ పెంచగ ఏ పూజలు చేసినన్,<br>నీ వంటికి లేని మరింత మురికిన్ అంటగ ముందు తరతరాల వరకున్ మీ జన్మల్<br>మురికి కాల్వల పడ దోమలై, ఈగలై చత్తురే గాని, తరించు మార్గమున్నదే....! |
| 141. | చేసెడి పూజలేవో నిష్టతగా, కష్టంబైన ఫలాపేక్ష రహితంబై నీ దోసిలిన్ పట్టి |

| | |
|---|---|
| | నిర్మలోదకము నాకిచ్చిన చాలదే, నిష్కపటివంచు గ్రహించుదు నీ దోసిలి పట్టిన నిర్మల నీరమున్....! |
| 142. | తరువైనన్ తన ఫలములన్, నీవేమిచ్చెదవంచు నీకున్ పంచి తనువున్ సంతృప్తిగ<br>తన నీడలన్ చేరిన ప్రాణులకున్, కొమ్మల ఆకులన్, కాయలన్, వేరులన్, ఊడలన్<br>అణువణువు అవతలి వారికి పంచి మొదలన్ తెగనరికినా<br>ముదమున నీ మంచినెంచి అసువుల్ బాసి తరించదే....! |
| 143. | కనుకన్ కనుము ఈ కలియందు యజ్ఞ యాగ క్రతువుల్ సేయగలేవని<br>ఆకలిని నీవు దీర్చుకొనంగ ముందే నీ కన్నులబడ నల్గురి దాహము తీర్చి పదిమందికి ఆకలి తీర్చినన్<br>యజ్ఞ పాయసాన్న మిచ్చినంత పరమానందంబు: ఆ జీవుల్ బడ జీవులకు జీవ దాతనైన<br>నీ చేతన్ చేయించిన ఈ దానముల్ నీ దాతృత్వముల్ సంతృప్తి గాంచి,<br>సదా సద్గతులన్ గల్గింతు సాయినారాయణుని సూక్తుల్ విని మోక్షం బందరే....! |
| 144. | భక్తుల రంజిల్ల జేయగ భగవంతుడే బహు భంగుల<br>భవతరణి దాటించు మార్గములు నుడివి.... నిన్ నాయకుడై నడిపించు గదా....! |
| 145. | నాటికి, నేటికి  జ్ఞానాంబుధిలో నను నమ్మి, నా వెంటవచ్చి, ప్రయాణీకులవుదురేని<br>యోగముల్, యాగముల్ భక్తి తరంగములపై దాటింతు మిము అలుపు లేకుండగన్....! |
| 146. | ఎత్తితిరి ఎన్నో జన్మల్ నే ఎత్తితిన్ మీ కన్న మున్నెన్నో జన్మముల్ ఆ జన్మ రహస్యముల్ మీరు మరచితిరే<br>కాని నే మిమ్ము వదలలేక జన్మ జన్మ పరంపరల నుండి జనకుడనై జ్ఞానోదయంబు కల్గించన్<br>మీ వెంట నుండి, ఈ పగిదిన్ చెపుచునుంటి పరుడవు కాదు, నే నీకు అన్యుడన్ కాను....! |
| 147. | నీకు, నాకు జన్మజన్మాంతర బంధమ్ము ఉండినన్ జన్మ కర్మలంబడి వెనుకకు<br>వెనుకకు మరలుచున్న నిను విజ్ఞానమునన్ ముందు ముందుకు నడిపింపక<br>నీ నావకు సరంగునై బహువిధముల భంగపడితి....! |
| 148. | పరమాత్మన్ నేను, నాదగు ఛాయారూపంబైన ఆత్మవు నీవు, నీ పాపపు నీడల జ్ఞాన కర్మల<br>సంయోగము వలన ఆత్మ యోగము నందన్ పరమాత్మ నందంగల స్థితి కెదిగెదవే !<br>నా జన్మము మీ నరుల ప్రాకృత మంటిది గాదు ఈ సకల ప్రాణులకు ప్రభువునై<br>విశ్వమున్ రచించెద యోగమాయ ద్వారా నా అవతారము ప్రకటించు కొందున్....! |
| 149. | నా జన్మము మీ నరుల ప్రాకృత మంటిది గాదు ఈ సకల ప్రాణులకు ప్రభువునై విశ్వమున్   రచించెద<br>యోగ మాయ ద్వారా నా అవతారము ప్రకటించుకొందున్....! |
| 150. | నా జన్మకున్ కర్మలనంటవు  నీ కంటిన కర్మన్ కరగదీయుటకే కమలాక్షుడ నైన నేను నీ వెంట పడితిన్! |
| 151. | నిరాకారుడను, పరంజ్యోతిని  ఏ తావున, ఏ వేళల, ఎక్కడెక్కడ, ఏ యుగంబుల నైనన్, |

| | |
|---|---|
| | అధర్మంబు వృద్ధి చెంద నన్ను నేనే సృష్టించు కొందు సాకార రూపంబులో....! |
| 152. | సాదు పురుషుల, సుగుణ సంపన్నుల, బాల, వృద్ధుల, అనాధల, శరణాగతుల, శిష్టుల రక్షించుటకై<br>అవతారము నెత్తుదును పాపులన్ నశింప జేయుటకై....! |
| 153. | ధర్మము వర్థిల్లగ ధర్మ రూపు మీ మీ స్వధర్మముల్<br>సుశిక్తుల యుగయుగంబుల ధర్మముల్ రక్షించుట నా భాధ్యత సుమీ....! |
| 154. | నాజన్మ కర్మముల్, బహు దివ్యముల్ నిర్మలంబులై లోకోత్తర ఉత్తమగతులకు దోహదకారులౌ<br>నా ఈతత్త్వంబరసి మదిన్ నిలిపినచాలు తనువు తరించి మరుజన్మలేక లయించుదురు ధన్యజీవులై.! |
| 155. | ననుగన, ఘనాఘన ఘనసుందర లీలగన ఘనసుందర, ఘనరూపుడు నైన అనురాగమూర్తిన్<br>గగన ఘన ఘనాంభోధిన్ విశ్వంబులు భువన భువనాంతరంబులు నా విశ్వరచనలుకన<br>ఘనులై ఈ గగనాంతర వసుంధరన్ వెదకినన్ గానగలేరే నా ఘనలీలలు కాంతునన<br>ఘనమైన కోరిక గగన కుసుమమై నిలిచె మీ నరుల్ ఏపాటి ఘనుల్, ఘనముగా చెప్పరే....! |
| 156. | గత యుగంబుల నుండి నేటికి, ఈ నవయుగ కలియుగంబు వరకు<br>ననుగన ఘనాఘనులుంటిరే, నూటిలోనో ఏపాటి సరివారలో? తమ రాగ, భయ, క్రోధముల్ నిశింప<br>చేసికొని ఘనమూర్తులైరి అనన్య ప్రేమ భావంబుతో నను గన నాలో లయించిరే....! |
| 157. | జ్ఞాన మార్గ, తపో మార్గముల ఘన శ్యామసుందరుని మార్గము ఎన్నుకొన<br>ఆ సుందర ఘన రూపుని రూప మందిరే మరి జన్మల్ లేకన్....! |
| 158. | ఘనమగు వేదాంతముల్ — ఘనాఘనముగ చెప్పితి<br>మీరు ఏపాటి ఘనులో — నా కవగతమైతిరి ఏనాడో....! |
| 159. | నాకు కొత్త కాదు ఇది నీకు కొత్తైన ఇది కొత్త పాత పద్ధతి సుమా<br>జన్మలు మారునే గాని, అనాది జనక వాక్యంబుల్ మారంబోవు మారలేవు....! |
| 160. | మరి కొన్ని జన్మ లెత్తినన్ కొత్త అవతారంబున పాత పద్ధతిలో కాచి వడపోసి<br>తరతరంబుల ఎత్తిన మరి కొత్త జన్మలకు కరతలామలకములౌ గీతామృత పానముల్....! |
| 161. | ఎవ్వరు ఏ విధముగా నన్ను భజింతురో అవ్విధముగా ఆ రూపంబున అనుగ్రహములు సంగ్రహముగా<br>ఇత్తు నే నాటి కృష్ణ పరమాత్మన్, నేనే నాటి నీ సాయినాథుండ....! |
| 162. | కర్మ ఫలములు కాంక్షించి ఇలవేల్పులను కొలిచెడి వారు నరులు<br>ఆ కర్మలకు సిద్ది త్వరిత మార్గము లందగన్ జన్మలెత్తినన్ కర్మ ఫలంబులు అంటవు మాకు....! |
| 163. | కామితములు అంటక యుంటిని కదా, నీ యెదుట కర్మల కాంక్షించు నీకు కర్మలు తప్పవు ! |

| | |
|---|---|
| | తత్త్వము తెలిసికొని ఏ కర్ముడు కర్మలకు బంధితుడు కానేరడు మరు జన్మలకు<br>కారణ జన్ముడు కాడు కలిగిన జ్ఞానంబుంటే....! |
| 164. | ఇంతలు చెప్పిన నీకు సుంత విజ్ఞానము రాదని నాకు తెలుసు, తేలికగా చెప్పితి చెవి వొగ్గిదవేని |
| 165. | పాపము ఎక్కువైన ఈ కలిని సాకారరూపుండనై పాపాగ్ని కీలలపడి పాపభయాందోళనల పడ్డ శిష్టులన్<br>రక్షింప పాపులన్ శిక్షింప నా ప్రేమామృత ధారల ప్రోదిచేసి, సాయిసాకరుండునై శ్రీమన్నారాయణుండనై,<br>ఇలన్ సద్గురు రూపమెత్తితి సాయిపరమాత్ముడనై....! |
| 166. | కోర్కెలు కోరిన మానవుడు సర్వ నాశనంబునకై మూలంబు అవునటంచు<br>మూఢతలు తొలగించి, చూచిన మోదము నందగల పరమానంద మొంద మొదలు ఇదియే సుమా...! |
| 167. | ఏనాడున్ తన కోరిక కోరక, తనంత తనకు సంప్రాప్తములైన వస్తువుల<br>సంతృప్తిని చెందువారి తత్త్వం అందు, ఆ సదానందబ్రహ్మన్....! |
| 168. | ఈర్ష్యా భావములు తొలగించు కొనగలచో  వర్ధిల్లు అతడే ఈశుండై ఇలన్<br>ఎవ్వడు హర్ష, శోక, ద్వంద గుణములకున్ అతీతుడో అతడందు సిద్ధత్వమున్....! |
| 169. | ఎవ్వరియందు ఆసక్తి నశించునో తనదగు దేహాభిమానమును, మమతలను త్యజించునో<br>ఎవ్వని అంతరంగ మందు, పరమాత్మ జ్ఞానము స్థిరముగా నిలచునో అట్టి మానవుడున్<br>సర్వకర్మానుష్టంబు చేయుచున్నను  కర్మల అంటక, సకల కర్మంబుల సంపూర్ణమౌను లీనుడై....! |
| 170. | యజ్ఞంబున హవిస్సులుగా  ధన, ధాన్య సంపూర్ణ సంపదలు అర్పణము చేతుమని<br>కలియుగంబందున చెప్పంబోరు ఎవ్వరున్....! |
| 171. | అహంకార, లోభ, మోహముల్ త్యజించి, జ్ఞానమున ఆత్మను రగిలించి<br>అందినవి అర్పణలు చేసితివే ఆ అగ్ని కాహుతులుగా వేసిన - కర్మస్థితుడౌ యోగముపొందు<br>స్థితినందుటయే కాక అందుదువు, అగుదువు నీవు పరమానంద బ్రహ్మవు....! |
| 172. | యజ్ఞయాగములు చేయుట నీ తత్త్వము కాదు నీ తత్త్వము విదిలించి కొత్త తత్త్వము చెప్పకపోను<br>తరచి చూచి రోగంబును బట్టి ధన్వంతరి ఏ ఔషధ మిచ్చునో...అట్లే, నే ఔషధ మిచ్చుచు..<br>నీ నాడిన్ పట్టి చెప్పెద తేలిక మార్గముల్....! |
| 173. | తత్వముల్ కట్టగట్టి సతతము ఆ పరమేశు పాదముల తపో జప ధ్యానముల్ లేకయే<br>నిరంతరము నిలిపితివేని.. నీ తనువు బ్రహ్మతత్వ మందుటయేగాక బ్రహ్మత్వము నీకిచ్చుట తేలికా....! |

ॐ ॐ ॐ